# బెల్టుషాపులపై లోక్‌సత్తా పార్టీ సమరభేరి



# మద్య నియంత్రణకు మహోద్యమం



డి.వి.వి.యస్.వర్మ

# మద్య నియంత్రణకు మహోద్యమం

డి.వి.వి.యస్.వర్మ

లోక్‌సత్తా పార్టీ

## ముందుమాట

# సమాజహితం కోసం మద్యంపై సమరం

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేస్తున్న మౌలిక సమస్య మద్యం. సుమారు 50 లక్షలకు పైగా పేద కుటుంబాలు ఈ మహమ్మారితో తల్లడిల్లిపోతున్నాయి. మద్యాన్ని ఆదాయ మార్గంగా ఎంచుకున్న పాలకులు ఉండడం వల్లనే ఈ పరిస్థితి దాపురించింది. టార్గెట్లు పెట్టి పాలకులే ఊరూరా మద్యం అమ్మిస్తున్నారు. దీంతో చట్టవిరుద్ధంగా ఊరూరా బెల్టుషాపులు జోరు పెరిగింది. రాజకీయాలకు, మద్యం పరవళ్లకు అవినాభావ సంబంధం ఉంది. ఎన్నికల్లో ఓట్ల కోసం నోటుతో పాటు భారీగా మద్యం అందించి ప్రజలకు తాగబోస్తున్నారు. వారిని మద్యానికి, బెల్టుషాపులకు బానిసలను చేస్తున్నారు. ఆ కుటుంబాలు నాశనం అవుతున్నాయి.

ప్రసుత్తం రాష్ట్రంలో ప్రభుత్వానికి వస్తున్న మద్యం ఆదాయంలో అధికశాతం బెల్టుషాపుల ద్వారా జరిగే అమ్మకాల నుంచి వస్తున్నదే. ఒక్కొక్క మండలంలో లైసెన్సు షాపులు రెండుమూడు ఉంటే బెల్టుషాపులు 50 నుంచి 100 వరకు ఉన్నాయి. బెల్టుషాపుల నిర్వహణ పూర్తిగా చట్ట విరుద్ధం. ఈ వాస్తవాలను చెప్పి ప్రజలను చైతన్యపరచి బెల్టుషాపులను మూసివేయిస్తాం. ఈ ఉద్యమం శాంతియుతంగా, చట్టబద్ధంగా సాగుతుంది. అక్టోబరు 2లోగా ప్రభుత్వం ఈ బెల్టుషాపులను మూసివేయకపోతే సీఆర్‌పీసీ (సెక్షన్ 43) ప్రకారం బెల్టుషాపులు నిర్వహిస్తున్నవారిని ప్రజలే అరెస్టు చేసి చట్టానికి అప్పగిస్తారు. ఈ సమస్యపై పోరాటానికి ఎవరైనా ముందుకు రావచ్చు. అన్ని పార్టీలలోనూ సమాజహితాన్ని కోరేవారు ఉన్నారు, వారందరినీ ఆహ్వానిస్తున్నాం. కానీ రాజకీయ పార్టీలకు మాత్రం స్పష్టమైన విధానాలు ఉండాలి; నిబద్ధత ఉండాలి. బెల్టుషాపులకు పునాదులు వేసింది టీడీపీ. వాటిపై కట్టడాలు నిర్మించి విచ్చలవిడి అమ్మకాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ. వారికి ఈ ఉద్యమం గురించి మాట్లాడే అర్హత లేదు. గతంలో చేసిన తప్పులు అంగీకరించి, ఎన్నికల్లో మద్యం పంపిణీ చేయమని ప్రమాణం చేసి వారు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావచ్చు. ఈ మాత్రం చిత్తశుద్ధిని పార్టీలు ప్రదర్శించాలి. బెల్టుషాపులపై సమరం ఇప్పటికే ప్రారంభమయ్యింది. రాష్ట్రంలో పలు గ్రామాలలో మహిళలు వాటిని మూయిస్తున్నారు. సారా బట్టీలను బందు చేస్తున్నారు. అక్రమ షాపులపై సాగిస్తున్న సమరం ఇది. సమాజహితం కోసం సాగిస్తున్న ఉద్యమం ఇది. నిర్భయంగా, నిస్సంకోచంగా ఈ మహోద్యమంలో పాలుపంచుకోండి. మద్యం మహమ్మారిని గ్రామాల నుండి తరిమేయండి. మహిళల జీవితాలలో వెలుగులు నింపేవరకు విశ్రమించకండి. లోక్‌సత్తా పార్టీ ఈ ఉద్యమంలో అగ్రభాగాన ఉంటుంది. మహిళలకు అండగా ఉంటుంది.

ఈ పుస్తకం ఉద్యమకారులకు కరదీపికగా ఉంటుందని, ఉత్తేజాన్ని, సమరోత్సాహాన్ని కలిగిస్తుందని ఆకాంక్షిస్తున్నాను.

హైదరాబాద్
23-08-2007

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

# మద్య నియంత్రణకు మహోద్యమం

## 1. పాలకుల పాపం- ప్రజలకు శాపం

మన రాష్ట్ర జనాభా 8 కోట్లు. 23 జిల్లాలున్నాయి. 30 వేల గ్రామాలున్నాయి. రాష్ట్రంలో అధికారికంగా 6,564 లైసెన్సులు గల మద్యం షాపులున్నాయి. 1286 బార్లు ఉన్నాయి. ప్రజల ముంగిటకు పాలన చేరకపోయినా మద్యం చేరడానికి బెల్టుషాపులు వాహనాలయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు ఒక లక్షకుపైగా బెల్టుషాపులున్నాయి. ప్రతి గ్రామానికి సగటున 4,5 బెల్టుషాపులున్నాయి. ఇందులో 60 శాతం బెల్టుషాపులు పూర్తిగా పేదలు నివశించే ప్రాంతంలోనే ఉన్నాయి. దీనికితోడు నిషేధించబడిన సారా, గుడుంబాలు గ్రామాలను ముంచెత్తుతున్నాయి.

మొత్తం మీద రాష్ట్రంలో మద్యం, నాటుసారా ఏరులైపారుతోంది. ఇదంతా పాలకుల పాపం. పేదలకు, సామాన్య మధ్యతరగతికి మద్యం ఒక శాపం అయ్యింది.

రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలు ఈ మద్యం ఉచ్చులో చిక్కుకున్నాయి. రోజురోజుకీ ఆ కుటుంబాలు క్షీణించి పోతున్నాయి. ఏగ్రామం వెళ్ళినా మనస్సును కలచి వేసే దయనీయ గాథలు, విషాదసంఘటనలే.

- 40 ఏళ్ళ లోపులోనే భర్తలు చనిపోయిన భార్యలు.... కన్నీటితో కుటుంబ భారాన్ని మోస్తున్న వితంతువులు

- జేబులు ఖాళీచేసుకుని పూటుగా తాగి వచ్చిన భర్తలు చేస్తున్న ఆగడాలు; భార్యని, పిల్లల్ని చితకబాదడం, ఇంట్లోదొరికిన వస్తువుల్ని తాకట్టు పెట్టడం, తెగనమ్మడం, ..... తాగిన మైకంలో వావివరుసలు లేని అకృత్యాలకు పాల్పడడం,..... కుటుంబాలను పస్తులపాలు చేయడం,...జగడాలు, తన్నులాటలు, వీధిగొడవలు,... పిల్లల చదువు ఆగిపోతున్నది, అనారోగ్యం వస్తే చేతిలో దమ్మిడీ లేక ఆదుకునే దిక్కులేక కుమిలికుమిలి చస్తున్నారు. మహిళల బతుకు దినదినగండం అయ్యింది.

....... ఇలా ఏ గ్రామం వెళ్ళినా, ఏ పల్లెకు వెళ్ళినా .... ఏ మహిళను కదిలించినా ఇదే రోదన... ఇదే ఆవేదన.... ఇవే బాధలు.... ఇవే గాథలు.....

లోక్‌సత్తా పార్టీ తన జనరాజకీయ యాత్రలలో ఈ కన్నీళ్ళను కళ్ళారా చూసింది. ఎన్ని అడ్డంకులు వచ్చినా, అవాంతరాలు ఎదురైన గ్రామాలనుండి మద్యం మహమ్మారిని తరిమెయ్యాలని సంకల్పించింది. ఇంతకంటే సమాజహితం, ఇంతకంటే గ్రామాభ్యుదయం మరొకటి ఉండదు.

మనసున్నవారందరిని ఈ మహోద్యమానికి ఆహ్వానిస్తున్నాం. మహిళలకు అండగా నిలబడదాం. నాయకత్వాన్ని అందిద్దాం. బెల్టుషాపుల్ని మూయిద్దాం. నాటుసారా, గుడుంబాలను అరికడదాం.

## 2. మద్యాన్ని ఆదాయమార్గం చేసుకున్న ప్రభుత్వాలు

లక్షలాది సామాన్య పేద కుటుంబాలు చితికిపోతున్నా, మహిళల బతుకులు కాలిపోతున్నా, ప్రభుత్వాలు మాత్రం మద్యాన్ని ఆదాయ మార్గం చేసుకున్నాయి. ప్రతిఏటా టార్గెట్లు పెంచడం, ప్రజల్ని మరింత తాగించడం ప్రభుత్వాలు తమ కార్యక్రమాలుగా చేసుకున్నాయి.

తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేస్తానంది.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్ చేస్తానంది.

కాని ఈ ప్రభుత్వాలు ఒకరిమీద ఒకరు పోటీ పడి మద్యాంధ్రప్రదేశ్‌ని చేశాయి. ఇంతకంటే విషాదం మరొకటి ఉండదు.

- 1986లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం "వారుణి వాహిని" పేరుతో సారా అమ్మకాన్ని ప్రారంభించింది. మద్యాన్ని ఆదాయ మార్గంగా శ్రీకారం చుట్టింది. 1989లో ఆ ప్రభుత్వం పడిపోయింది. 1992-93లో "వారుణి వాహిని"కి వ్యతిరేకంగా మద్యంపై మహిళల పోరు సాగింది. మద్యనిషేదాన్ని ప్రకటిస్తానని ఈ ఉద్యమానికి మద్దతు పలికి తిరిగి తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. 1995లో మద్యనిషేధాన్ని విధించింది. తిరిగి రెండేళ్ళలోనే మద్య నిషేధాన్ని సడలించి, తిరిగి మద్యం అమ్మకాలను మొదలుపెట్టింది.

- 1997-98లో తెలుగుదేశం ప్రభుత్వం మద్యంపై దాదాపు 1000 కోట్ల అదాయంతో ప్రారంభించి 2003-04 సంవత్సరం నాటికి ఈ ఆదాయాన్ని 3,572 కోట్లకు పెంచింది. ఇందుకోసం 2001లోనే 25వేల బెల్టుషాపులు వెలిశాయి. అవి రోజు రోజుకూ పెరుగుతూ వచ్చాయి.

- 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటికున్న 3,572.00 కోట్ల ఆదాయాన్ని 2006-07 నాటికి 6,541.58 కోట్లకు పెంచింది. దీనికోసం రాష్ట్రంలో ఇప్పుడు లక్షకుపైగా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

ప్రభుత్వానికి ఎంత ఆదాయం పెరిగితే అంతగా ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయి. కుటుంబాలు నాశనం అవుతున్నాయి. అంతకుమించి వాళ్ళ వళ్ల గుల్ల అవుతున్నది. అనారోగ్యం, అకాల మరణాలు వెంటాడుతున్నాయి. దీనికితోడు ధరతక్కువ పేరుతో విషపూరితమైన నాటుసారా, గుడుంబాలను విక్రయిస్తున్నారు. అయినా ప్రభుత్వాలు పట్టించు కోవడంలేదు.

ఏ ప్రభుత్వానికైనా మద్యం ఆదాయ మార్గం కాకూడదు. ఆదాయం కోసం ప్రజల జీవితాలతో చెలగాటమాడకూడదు. కాని గత 9 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మాత్రం చేయకూడని ఈ పనులనే చేస్తున్నాయి.

తెలుగుదేశం ప్రభుత్వం - మద్యంపై అమ్మకాలపై వార్షిక ఆదాయం (కోట్లలో)

| సంత్సరం | ఎక్సైజ్ ఆదాయం | సేల్స్ టాక్స్ ఆదాయం | బీవరేజ్ కార్పొరేషన్ ఆదాయం | మొత్తం ఆదాయం |
|---|---|---|---|---|
| 1997-98 | 349.11 | 437.93 | 100.43 | 887.47 |
| 1998-99 | 924.01 | 906.53 | 134.00 | 1964.54 |
| 1999-2000 | 1038.41 | 1064.65 | 222.92 | 2325.98 |
| 2000-01 | 1242.96 | 1137.66 | 213.05 | 2593.67 |
| 2001-02 | 1651.9 | 1296.33 | 222.03 | 3170.26 |
| 2002-03 | 1856.46 | 1375.81 | 246.99 | 3479.26 |
| 2003-04 | 1914.98 | 1410.84 | 246.5 | 3572.32 |

కాంగ్రెస్ ప్రభుత్వం - మద్యంపై వార్షిక ఆదాయం (కోట్లలో)

| | | | | |
|---|---|---|---|---|
| 2004-05 | 2092.67 | 1741.42 | 286.45 | 4120.54 |
| 2005-06 | 2684.57 | 1983.80 | 408.53 | 5076.9 |
| 2006-07 | 3421.00 | 2516.40 | 604.18 | 6541.58 |
| 2007-08 | 4125.00 (బడ్జెట్ అంచనా) | 656.53 (ఏప్రిల్-జూన్) | 190.18 (ఏప్రిల్-జూన్) | - |

**బెల్టుషాపులు వద్దు**
**నాటుసారా రద్దు**
**మహిళ గీసెను హద్దు**
**ఓ కూనలమ్మ**

## 3. కొంపలు కూల్చుతున్న బెల్టుషాపులు - నాటుసారా, గుడుంబాలు

రాష్ట్రంలో ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన మద్యం షాపులు 6,564 ఉన్నాయి. ఇందులో హెచ్చు భాగం పట్టణాలలో, నగరాలలో ఉన్నాయి. 1100 మండలాలలో ప్రతి మండలానికి ఒకటి, రెండు లైసెన్సు మద్యం షాపులు మాత్రమే ఉన్నాయి. రాష్ట్రంలో 30వేల గ్రామాలున్నాయి. అందులో 2వేల గ్రామాలలో మాత్రమే లైసెన్సు షాపులున్నాయి.

గ్రామాలలో బెల్టుషాపులే మద్యం చిచ్చు పెడుతున్నవి. ప్రతి గ్రామానికీ సగటున 4, 5 బెల్టుషాపులున్నాయి. అంటే వీటిని తొలగిస్తే 28000 గ్రామాలలో మద్యం అందుబాటులో ఉండదు. బెల్టుషాపుల్ని తొలగిస్తే మద్యం పీడ చాలా వరకు విరగడ అవుతుంది. తాగాలనుకుంటే కనీసం 5,10 కిలోమీటర్లు పోవాల్సి ఉంటుంది. ముందు చర్యగా వీటిని తొలగించాలని లోక్‌సత్తా కోరుతున్నది.

- బెల్టుషాపుల వల్లనే గ్రామంలో సందు సందునా విచ్చలవిడిగా మద్యం దొరుకుతున్నది. నిషా దిగగానే మళ్ళీ మళ్ళీ తాగడానికి వీలుకలుగుతున్నది

- బెల్టుషాపులలో అరువు ఇస్తారు, అప్పులు పెడతారు అందుచేత చేతిలో డబ్బులు లేకపోయినా తాగడానికి వీలు కలుగుతున్నది

- బెల్టుషాపులు కొన్నింటిలో వస్తువులు తాకట్టు పెట్టుకుంటారు. కొన్ని షాపులలో బియ్యం, ధాన్యం, తృణధాన్యాలు కూడా తీసుకుంటారు. ఇంటింటినీ ఇలా బెల్టుషాపులు కొల్లగొడుతున్నాయి.

గ్రామంలోనూ, కుటుంబంలోనూ అన్ని అనర్థాలకి బెల్టుషాపులే కేంద్ర బిందువులుగా ఉన్నాయి. ఈ అక్రమ బెల్టుషాపులకి తోడు నాటుసారా, గుడుంబాలు కూడా యథేచ్ఛగా దొరుకుతున్నాయి. ఇవి ప్రాణాంతకమైన కల్తీతో వస్తున్నాయి. గ్రామం పక్కనే బట్టీలు పెట్టి వీటిని అందిస్తున్నారు. నాటుసారా, గుడుంబాల మీద నిషేధం ఉంది. వీటిని కాయడం, అమ్మడం కఠిన శిక్షార్హమైన నేరం. కాని ప్రభుత్వాలు చూసీచూడనట్టు వదిలేస్తున్నాయి.

ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఉచితంగా మద్యాన్ని వారాల తరబడి పోస్తున్నాయి. ఎన్నికల్లో ఉచిత సారా వల్ల చాలామంది కొత్తగా తాగుడుకు అలవాటు పడుతున్నారు. బెల్టుషాపులకు బానిసలు అవుతున్నారు. ఎన్నికల్లో సారా, మద్యం పంపిణీ నేరం. కాని ఆ నేరాన్ని ప్రధాన పార్టీలు పోటీపడి చేస్తున్నాయి. కొత్తవారిని తాగుడులోకి లాగుతున్నాయి.

ఈ పద్ధతిని చక్కదిద్దడానికి, అక్రమషాపుల్ని తొలగించడానికి తక్షణమే పూనుకోవాలి. కాని ప్రభుత్వాలు ఏనాడూ ఆ పని చెయ్యలేదు. ఎందుకంటే మద్యం ప్రభుత్వాలకి ఆదాయ మార్గం అయ్యింది. ప్రజలు ఎంతతాగితే అంత ఆదాయం అన్నదే వాటికి లక్ష్యం అయ్యింది.

## 4. చట్ట విరుద్ధమైన బెల్టుషాపులు

బెల్టుషాపులు చట్టబద్ధంగా ఏర్పడిన షాపులు కావు. లైసెన్సు లేని అక్రమషాపులు. అక్కడ అమ్మే సరుకుకు బిల్లులు ఇవ్వరు. లైసెన్సు లేకుండా, "బెల్టు"షాపులలో మద్యాన్ని, కల్తీ సరుకుని అమ్మడం తీవ్రమైన నేరం (వారంటులేకుండా అరెస్టు చేయగలిగిన నాన్- బెయిలబుల్ నేరం i.e. non-bailable & cognizable). అలాగే నాటుసారా, గుడుంబాలు నిషేధించబడ్డాయి. బట్టీ పెట్టడం, అమ్మడం నేరం.

**ఆం.ప్ర ఎక్సైజ్ చట్టం, 1968**

సెక్షన్ 14 మరియు జిఓ 268, 1997 - అనుమతి లేకుండా, పరిమితికి మించి మద్యాన్ని ఒక వ్యక్తి తన దగ్గర పెట్టుకోవడం నేరం.

సెక్షన్ 37-ఎ : తీవ్ర అనారోగ్యం, ప్రాణహాని కలిగించే కల్తీ మద్యాన్ని అమ్మడం నేరం. (ఇలాంటి నేరాలకు 10 ఏళ్ళ గరిష్ఠ జైలు శిక్ష + జరిమానా; తీవ్ర అస్వస్థత, వైకల్యం లేదా ప్రాణనష్టంజరిగితే గరిష్ఠ జైలు శిక్ష జీవితఖైదు)

సెక్షన్ 42 (34, 37-ఎ తో కలిపి) : ఒక వ్యక్తి తన వద్ద ఉన్న మద్యానికి, ఇతర సామాగ్రికి తగిన ఆధారాలు చూపకపోతే, ఆ వ్యక్తిని దోషిగా పరిగణిస్తారు.

సెక్షన్ 45(1) : అక్రమంగా మద్య నిల్వ, అమ్మకం జరిగినప్పుడు మద్యాన్ని, ఇతర సామాగ్రిని జప్తు చేయవచ్చును.

**ఆం.ప్ర మద్యపాన నిషేధ చట్టం, 1995**

సెక్షన్‌లు 7,8 (ఎ) మరియు (బి) : చట్టం విరుద్ధంగా మద్యాన్ని అమ్మడం, కొనడం, నిల్వచేయడం నేరాలు. (5 ఏళ్ళ గరిష్ఠ జైలు శిక్ష)

సెక్షన్ 12 : చట్ట అతిక్రమణ జరిగితే మద్యాన్ని, ఇతర సామాగ్రిని జప్తు చేయవచ్చు.

సెక్షన్ 11-ఎ : 8(బి) కింద నేరారోపణలకు కోర్టులోనే తప్ప బెయిల్ ఇవ్వరాదు.

సెక్షన్ 25 : ఈ చట్టం కింద వారంటు లేకుండా అరెస్టు చేయవచ్చును.

సెక్షన్ 7-ఎ : సారా పూర్తిగా నిషిద్ధం.

సెక్షన్‌లు 28, 29 : చట్టం అమలుకోసం తోడ్పాటునివ్వడం రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ అధికారులందరి బాధ్యత, కర్తవ్యం.

**భారత శిక్షా స్మృతి (Indian Penal Code, IPC)**

సెక్షన్లు 272, 273 : తినే, తాగే వస్తువులను వ్యక్తికి హాని జరిగే విధంగా కల్తీచేయడం, అమ్మడం నేరం. (6 నెలలు గరిష్ఠ జైలు శిక్ష + జరిమానా)

సెక్షన్లు 481,482,483,484,486,487,488,489 : అమ్మే వస్తువులమీద నకిలీ/ తప్పుడు లేబుళ్ళు లేదా ముద్రలు వేయడం నేరం. (3 సంవత్సరాలు గరిష్ఠ జైలు శిక్ష + జరిమానా)

**ఆం.ప్ర పంచాయతీరాజ్ చట్టం, 1994**

సెక్షన్ 119 : గ్రామపరిధిలో లైసెన్సు లేని షాపుల్ని/అమ్మకాలని పంచాయితీ నిరోధించవచ్చు.

# బెల్టుషాపుల్ని మూయించడం ఎలా?

గ్రామాలలో పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు తలచుకుంటే ఈ బెల్టుషాపులు ఒక్కరోజులో మూతబడతాయి. నిస్సందేహంగా, నిస్సంకోచంగా బెల్టుషాపుల మూసివేతకు ఉద్యమించండి. నాటుసారా, గుడుంబాల అమ్మకాలను నిరోధించండి.

**సంఘటితంగా ఉద్యమించండి**

"మా ఊళ్ళో బెల్టుషాపులు వద్దు - మద్యం, నాటుసారా, గుడుంబాల అమ్మకాలు వద్దు" అన్న నినాదంతో మహిళలు, యువకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు సంఘటితమై మద్యాన్ని గ్రామం పొలిమేరలు దాటించే ఉద్యమాన్ని సాగించండి. మహిళల బృందాలు, యువ బృందాలు ఏర్పడి ఈ ఉద్యమాన్ని శాంతియుతంగా ఒక క్రమపద్ధతిలో సాగించండి.

1. రాష్ట్రంలో ఎక్కడా బెల్టుషాపులు లేవని ఎక్కడైనా బెల్టుషాపుల వివరాలు తెలియజేస్తే వాటిని తక్షణం మూసివేయిస్తామని ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు. మీ గ్రామంలో బెల్టుషాపుల వివరాలు సేకరించి పంపండి. కళ్లుండీ చూడలేని ప్రభుత్వానికి కళ్లు తెరిపించండి. వెంటనే ఈ బెల్టుషాపుల్ని మూసివేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాయండి. ఈ ఉత్తరాల కాపీలను స్థానిక పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు పంపండి. పత్రికలకు విడుదల చేయండి.

2. గ్రామ పంచాయితీ పరిధిలో లైసెన్సు లేకుండా మద్యం అమ్మకాలు సాగించే బెల్టుషాపులు నిర్వహించడం నేరం. పంచాయితీ చట్టం ప్రకారం ఇలాంటి షాపులపై చర్య తీసుకునే అధికారం పంచాయితీలకు ఉంది. అందుచేత గ్రామ పంచాయితీ తీర్మానం చేసి ఎక్సైజ్ అధికారులు, పోలీసుల తోడ్పాటుతో వీటిని తక్షణం తొలగించమని పంచాయితీలను కోరండి.

3. అక్టోబర్ 2, 2007 నుండి రాష్ట్ర వ్యాపితంగా బెల్టుషాపుల మూసివేత కార్యక్రమానికి లోక్‌సత్తా పార్టీ సన్నాహాలు చేస్తున్నది. ఆ రోజునుండి గాని, స్థానికంగా ఒక గ్రామంలో అవసరం అనుకుంటే అంతకుముందే, బెల్టుషాపులు మూయించే కార్యక్రమాన్ని చేపట్టండి. ముందుగా పోలీసులకు, ఎక్సైజ్ శాఖకు నిర్దిష్టమైన తేదీలోగా బెల్టుషాపులు మూయించకపోతే ప్రజలే ఆ పని చేయాల్సి ఉంటుందని తెలియజెయ్యండి. గడువు ముగిసిన తర్వాత మీకు అనువైన తేదీన మహిళా బృందాలు, యువ బృందాలు, పెద్దలు అందరు కలసి బెల్టుషాపుల ముందు శాంతియుత సత్యాగ్రహాన్ని నిర్వహించండి. ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు తెలియచేయండి.

# ప్రజా అరెస్టులు చేయించడం ఎలా ?

ప్రభుత్వం స్పందించకపోతే, బెల్టుషాపులు మూసివేయకపోతే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (Criminal Procedure Code, CrPC) సెక్షన్ 43 ప్రకారం **'ప్రజాఅరెస్టు'కార్యక్రమాన్ని చేపట్టండి.**

లైసెన్సులేకుండా, బెల్టుషాపులలో మద్యం అమ్మడం (non-bailable & cognizable నేరం. ఇలాంటి నేరాలను నివారించే, నిరోధించే బాధ్యత ప్రజలకు ఉంది. సెక్షన్ 43 ప్రకారం ఇలాంటి నేరాలు జరుగుతున్నప్పుడు ప్రజలే నేరస్తులను అరెస్టు చేసి పోలీసులకు లేదా స్థానిక మెజిస్ట్రేట్‌కు అప్పగించాలి. ఈ ప్రజా అరెస్టు కార్యక్రమం చట్టబద్ధమైన కార్యక్రమం.

ఈ ఉద్యమ కార్యక్రమాలన్నీ శాంతియుతంగా నిర్వహించాలి. మీకు ఎప్పుడు ఏ సలహా, సహాయసహకారాలు అవసరమైనా, **లోక్‌సత్తా పార్టీ "హెల్ప్‌లైన్" 040-23232711** కు వెంటనే ఫోన్ చెయ్యండి. లోక్‌సత్తా పార్టీ మీకు పూర్తి తోడ్పాటును అందిస్తుంది.

మద్యం అక్రమ అమ్మకాలను నిరోధించడానికి మనం పోరాడుతున్నాం, చట్టాన్ని నిలబెట్టడానికి పోరాడుతున్నాం. అందుచేత అంతిమ విజయం ప్రజలదే అవుతుంది. నిర్భయంగా ఈ పోరాటాన్ని సాగించాల్సిందిగా లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేస్తుంది. ఈ ఉద్యమానికి గ్రామంలోని మహిళలంతా కదలి రావాల్సిందిగా కోరుతున్నది. పెద్దల్ని, ప్రజాప్రతినిధులను, ప్రజలందరినీ సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది. బెల్టుషాపుల పీడ, నాటుసారా, గుడుంబాల పీడ వదిలించుకున్న ఆదర్శగ్రామంగా మీ గ్రామాన్ని తీర్చిదిద్దండి. పేదల, సామాన్య ప్రజల జీవితాలలో వెలుగులు నింపండి.

**చీపులిక్కరు చెలిమి**

**బెల్టుషాపుల కలిమి**

**కొంపకొచ్చెను కొలిమి**

**ఓ కూనలమ్మ**

## మద్య నియంత్రణకు లోక్‌సత్తా పార్టీ ఎజెండా

లోక్‌సత్తాపార్టీ అక్టోబర్ 2, 2006న ఆవిర్భవించింది. ప్రస్తుత ధనరాజకీయాన్ని, జనరాజకీయం చేయడానికి ఈ పార్టీ ఏర్పడింది. సమాజహితంకోసం రాజకీయం చేయాలని సంకల్పించింది. కొత్తతరానికి కొత్తరాజకీయాన్ని అందించడం తన లక్ష్యంగా ప్రకటించింది.

లోక్‌సత్తా పార్టీ ఏర్పడిననాడే తన ఎజెండాను స్పష్టం చేసింది. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న మద్యం మహమ్మారిపై యుద్ధాన్ని ప్రకటించింది. కఠినమైన మద్యనియంత్రణ తన ఎజెండాగా ప్రకటించింది. ఏదిఏమైనా దీన్ని సాధించడానికి లోక్‌సత్తా పార్టీ కంకణం కట్టుకుంది.

### మద్యనియంత్రణపై ఎజెండా

- పేదలు, సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని, కుటుంబ జీవనాన్ని కొల్లగొట్టే మహమ్మారిగా మద్యాన్ని లోక్‌సత్తాపార్టీ పరిగణిస్తుంది. మద్యం ప్రభుత్వానికి ఆదాయమార్గం కాకూడదని, మద్యనియంత్రణకు ప్రభుత్వమే పూర్తిబాధ్యత తీసుకోవాలని విస్పష్టంగా ప్రకటిస్తుంది.
- లోక్‌సత్తాపార్టీ రాష్ట్రంలోని అన్ని బెల్టుషాపుల్ని రద్దు చేస్తుంది. ప్రస్తుతం ఉన్న 6,564 లైసెన్సు షాపులను వెయ్యిలోపలికి తెస్తుంది. **ప్రభుత్వమే ఈ షాపుల్ని నిర్వహిస్తుంది.** అమ్మకం రోజులను, వేళలను కుదిస్తుంది.
- రాష్ట్రంలో బహిరంగ మద్యపానాన్ని నిషేధిస్తుంది. బహిరంగంగా తాగినా, తాగి బయట తిరిగినా తీవ్ర నేరంగా పరిగణిస్తుంది.
- రాష్ట్ర, జాతీయ రహదారుల వెంట మద్యం షాపులు లేకుండా చేస్తుంది.
- నాటుసారా, గుడుంబాలను పూర్తిగా నిషేధించి స్థానిక ప్రభుత్వాలకి, (పంచాయితీలు, మున్సిపాలిటీలకు) మహిళా సంఘాలకి, డ్వాక్రా సంఘాల సమాఖ్యలకి, అక్రమ సారాయిని అదుపుచేసే అధికారాలు ఇస్తుంది.
- రాజకీయ పక్షాలు ఎన్నికలలో మద్యం పంపిణీని చేయకుండా కఠినమైన చర్యలు తీసుకుంటుంది. లోక్‌సత్తా పార్టీ ఎన్నికల్లో మద్యం పంపిణీని ఎట్టి పరిస్థితుల్లోనూ చెయ్యదు.
- మద్యపానంవల్ల కలిగే అనర్థాలపై విస్తృతమైన ప్రచారాన్ని సాగిస్తుంది. డీ-ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తుంది. తాగుడుకు బానిసలైన వారిని ఈ వ్యసనం నుండి విముక్తుల్ని చేస్తుంది.

# బెల్టుషాపులను మూయించండి

*గౌ॥ శ్రీ వైయస్ రాజశేఖరరెడ్డి* *తేదీ : 22-6-2007*
*ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి*
*హైదరాబాద్*

*గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖరరెడ్డి గారికి,*

రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాల పట్ల అనుసరిస్తున్న విధానాలను పునః సమీక్షించుకోవాల్సిన సమయం ఇప్పటికే మించిపోయింది. సంపూర్ణ మద్య నిషేధం ఆచరణలో విఫలం అవుతున్నందువల్ల మద్యం అమ్మకాలను కఠినంగా నియంత్రించడం ప్రభుత్వ విధానంగా ఉండాలని వేం భావిస్తున్నాము. మద్యం వ్యాపారం ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరులలో ఒకటిగా భావించడం కంటే దారుణం మరొకటి ఉండదు. దానిని ఏ ప్రభుత్వమూ అనుసరించకూడదు.

**రాష్ట్రంలో బెల్టుషాపులు లేవు**
**తెలియజేస్తే మూయిస్తాం**
**- ముఖ్యమంత్రి ప్రకటన**

---

**చూపిస్తాం.. మూయించండి**
**మూయించకపోతే ఉద్యమిస్తాం**
**- జయప్రకాష్ నారాయణ్ లేఖ**

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ మార్గం చేసింది. బెల్టుషాపులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుత ప్రభుత్వం దానిని కొనగించడమే కాకుండా ఆదాయాన్ని రెండితలు మూడింతలుగా పెంచుకుంటూ పోతున్నది. దీని పర్యవసానంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నది. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల కుటుంబాలు ఇప్పటికే గుల్ల అయ్యాయి. అందుచేత రాష్ట్రంలో మద్యంషాపుల నిర్వహణపై ప్రభుత్వం ఒక స్పష్టమైన విధాన ప్రకటన చేయాల్సిందిగా కోరుతున్నాం.

రాష్ట్రంలో మద్యం దుకాణాల సంఖ్య తగ్గినట్టు ప్రభుత్వం చేస్తున్న ప్రకటన నిజాన్ని దాచిపెడుతున్నది. తగ్గిన షాపుల కంటే కొన్ని వందల రెట్లు బెల్టుషాపులు గ్రామాలలో, పట్టణాలలో పుట్టుకొచ్చాయి. మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగినట్లు ప్రభుత్వ లెక్కలే సూచిస్తున్నాయి. అందుచేత షాపులు తగ్గాయని ప్రభుత్వం సంతృప్తి

పడడం వాస్తవాలని చూడనిరాకరించడమే అవుతుంది.

ఇటీవల శాసనసభలో రాష్ట్రంలో బెల్టుషాపులు లేవని ఎక్కడైనా ఉన్నట్టు సమాచారం ఇస్తే వాటిని మూసివేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఇప్పుడు లక్షకు పైబడి బెల్టుషాపులు ఉన్నాయన్నది అనధికార అంచనా. ఇవన్నీ అక్రమషాపులు; లైసెన్సు ఉన్న షాపులకి అనుబంధంగా ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో, ప్రతి సందు సందుకీ విస్తరించిన రిటైల్‌షాపులు. ప్రభుత్వానికి, ఎక్సైజుశాఖకి, పోలీసులకు తెలియకుండా ఈ షాపులు నిర్వహిస్తున్నారంటే అది నమ్మశక్యం కాని అంశం.

ఏ గ్రామానికి వెళ్ళినా ఎక్కడ బెల్టు షాపులు ఉన్నాయన్నదీ ప్రతి ఒక్కరూ స్పష్టంగా చెప్పగలుగుతున్నారు. అందుచేత ప్రభుత్వానికి తెలిసి, దాని మద్దతుతోనే ఈ బెల్టుషాపులు నడుస్తున్నాయి. లేకపోతే అవి ఒక్కరోజు కూడా వ్యాపారాన్ని సాగించలేవు. అందుచేత బెల్టుషాపులపై ప్రభుత్వం విస్పష్టమైన ప్రకటన చెయ్యాల్సిందిగా కోరుతున్నాం. ఈ అక్రమ షాపుల ద్వారా అమ్మకాలు పెంచి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునే పద్ధతికి స్వస్తి చెప్పాల్సిందిగా కోరుతున్నాం.

ప్రధాన రహదాల వెంట రోడ్ల ప్రమాదాలను అరికట్టడానికి, తాగివాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని చేసిన ప్రకటన ఆహ్వానించదగింది. కాని ప్రధాన రహదారుల మీద కేవలం వాహనదారుల కోసమే ప్రత్యేకంగా మద్యం దుకాణాలు ఉన్నాయి.

ఈ మద్యం దుకాణాలు రాత్రింబవళ్ళు తెరిచే ఉంటున్నాయి. ముందుగా ఈ దుకాణాలను మూసివేయాలి. అంతేగాని తాగడానికి ఏర్పాట్లు చేస్తాం, తాగి వాహనం నడపడాన్ని నిరోధిస్తాం అనడం బండి వెనుక గుర్రాన్ని కట్టడం అవుతుంది. అందుచేత ముందుగా ప్రధాన రహదారుల వెంట ఉన్న అన్ని మద్యం దుకాణాలను మూసి వెయ్యడానికి చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాం.

మద్యం మీద వచ్చే ఆదాయంలో 10శాతం మద్యపాన వ్యతిరేక ప్రచారానికి వినియోగిస్తామని ప్రకటించారు. అందుకోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లనూ, కార్యకలాపాలనూ బహిర్గతం చెయ్యాల్సిందిగా కోరుతున్నాం.

రాష్ట్రంలో మద్యం ఒక రాజకీయ, సామాజిక సమస్య అయ్యింది. లక్షలాది కుటుంబాలు మద్యం మహమ్మారికి బలౌతున్నాయి. దీనిపై కఠిన నియంత్రణ అవసరం అని ప్రజలు భావిస్తున్నారు. అందుచేత దీనిని ఒక సామాజిక, రాజకీయ ఉద్యమంగా లోక్‌సత్తా పార్టీ చేపడుతుంది. ప్రజలలో చైతన్యాన్ని పెంచడం ఒక్కటే సరిపోదు. మద్యంపై కఠిన నియంత్రణ ఉన్నప్పుడే ఫలితాలు వస్తాయి.

**ప్రభుత్వం తక్షణం ఈ క్రింది చర్యలు తీసుకోవల్సిందిగా లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది**

- రాష్ట్రంలో బెల్టుషాపుల్ని నిషేధించి, తక్షణం వాటిని మూసివేయాలి గుడుంబా, నాటుసారాలను పూర్తిగా నిరోధించాలి

- రహదారుల వెంట ఉన్న మద్యంషాపులను మూసి వెయ్యాలి

- లైసెన్సు ఉన్న మద్యం దుకాణాల దగ్గర బహిరంగ మద్యపానాన్ని నిషేధించాలి

- మద్యపానానికి వ్యతిరేకంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం చేపట్టాలి. **డీ ఎడిక్షన్ సెంటర్‌లను** అందరికీ అందుబాటులోకి తేవాలి.

ఈ అంశాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాం. మద్యంషాపులకు లైసెన్సు ఇచ్చేటప్పుడు, వేలంపాటలు నిర్వహించేటప్పుడు, బెల్టుషాపులు నిర్వహించకూడదని, మద్యంషాపుల దగ్గర బహిరంగ మద్యపానాన్ని అనుమతించకూడదని షరతులను విధించాలి.

**మద్యంపై ఉద్యమం**

2007 జూలై నుండి బెల్టుషాపులు వివరాలు లోక్‌సత్తా పార్టీ సేకరించి ఉత్తరాల ద్వారా, పత్రికల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకైనా వాటిని తక్షణం మూసివేస్తారని ఆశిస్తున్నాం.

అగస్టు15 నుండి మహిళాసత్తా ఆధ్వర్యంలో మద్యపానానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచార యాత్రను నిర్వహిస్తుంది. ప్రజల్లో మద్యం మహమ్మారికి వ్యతిరేకంగా చైతన్యాన్ని పెంపొందిస్తుంది.

అక్టోబర్ 2లోగా బెల్టుషాపుల్ని పూర్తిగా తొలగించకపోతే ఈ అక్రమషాపుల మూసివేతను కోరుతూ ప్రత్యక్ష కార్యాచరణను చేపడుతుంది.

**అందుచేత మద్యం అమ్మకాల నియంత్రణకు, బెల్టుషాపుల తొలగింపుకు తక్షణమే తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాం.**

**అభివందనలతో,**

**భవదీయ,**

**(జయప్రకాష్ నారాయణ్)**

**లోక్‌సత్తా పార్టీ జాతీయ సమన్వయ కర్త**




# రాష్ట్రంలో బెల్టుషాపులు లేవు

తెలియజేస్తే మూయిస్తాం....

- ముఖ్యమంత్రి ప్రకటన

బెల్టుషాపులు చల్లి
కళ్ళు మూసిన పిల్లి
బుకాయింపుల లొల్లి
ఓ కూనలమ్మ

# మద్యంపై ద్వంద్వనీతికి ప్రభుత్వం స్వస్తి చెప్పాలి

రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా మద్యాన్ని ఆదాయ మార్గంగా చేసుకుంది. మద్యంమీద ఆదాయాన్ని 6541.58 కోట్ల నుండి ఈ వార్షిక సంవత్సరంలో ఆదాయాన్ని 8450 కోట్లకు విస్తరించడానికి టార్గెట్లు నిర్ణయించుకుంది. దానికి అనుగుణంగా ఎక్సైజ్‌శాఖలో ట్రాన్స్‌ఫర్‌లు, పోస్టింగులూ ఒక పక్క సాగిస్తూ మరొక పక్క మద్య విమోచన ప్రచార కమిటీని ఏర్పాటు చెయ్యడం రాష్ట్ర ప్రజల్ని వంచించడం తప్ప వేరు కాదని లోక్‌సత్తా పార్టీ స్పష్టం చేస్తున్నది. ప్రభుత్వం ఆదాయం కోసం రాష్ట్రంలో అక్రమ బెల్టుషాపుల్ని ప్రోత్సహిస్తూ గ్రామాలలో మద్యాన్ని ఏరులుగా పారిస్తున్నది. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి 50 లక్షల కుటుంబాలను తాగుడుకి బలి చేస్తున్నది. ఆదాయం కోసం ప్రభుత్వం సాగిస్తున్న మద్యం విస్తరణను కప్పిపుచ్చుకోడానికి, తామూ మద్యానికి వ్యతిరేకమేనని బూటకపు ప్రచారం కోసం వేసిన ఎత్తుగడ నుండి పుట్టుకొచ్చినదే తప్ప మద్యనియంత్రణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన ఏర్పాటు కాదని లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది.

**మద్య విమోచన ప్రచార కమిటీ ఏర్పాటు**
**- ప్రభుత్వ ప్రకటన**

---

**విమోచనకు కమిటీ - విస్తరణకు టార్గెట్లా?**
**- లోక్‌సత్తా పార్టీ ప్రతి స్పందన**
**ఆగస్టు 9,2007**

ఇంతమంది పెద్దలతో ఏర్పాటు చేసిన మద్య విమోచన కమిటీ "ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేందుకు మాత్రమే" అయితే ఆ కమిటీ నిరుపయోగం అవుతుంది. ఆ పెద్దల సేవలను పూర్తిగా వినియోగించుకునేలా ఉండాలే గాని వారిని ఉత్సవిగ్రహాలను చెయ్యడం ఉచితం కాదు.

1. మద్య విమోచన ప్రచార కమిటీని స్వయం ప్రతిపత్తిగల కమిటీగా ప్రకటించండి.

2. ఈ ప్రచార కమిటీకి మద్యంమీద వచ్చే ఆదాయంలో 10శాతం సొమ్మును వార్షిక బడ్జెట్‌గా ప్రకటించాలి.

3. రాష్ట్రంలో అన్ని ప్రజాసంఘాలతో కలిసి విస్తృత ప్రచార ఉద్యమం సాగించడానికి తగిన అన్ని ఏర్పాట్లు చెయ్యాలి.

4. ఈ కమిటీ దృష్టికి వచ్చిన అక్రమ బెల్టుషాపుల్ని మూసివేయించడానికి, నాటుసారా, గుడుంబా బట్టీలను నిషేధించడానికి, లైసెన్సు షాపుల దగ్గర బహిరంగ

మద్యపానాన్ని నిషేధించడానికి, రహదారుల వెంట ఉన్న మద్యం షాపుల్ని తొలగించడానికి ఈ కమిటీకి అధికారాలు ఇవ్వాలి.

ఈ అంశాల మీద ఈ కమిటీ ఆదేశాలను ఎక్సైజ్‌శాఖ విధిగా అమలు చేసేదిగా ఉండాలి. ఈ మద్య విమోచన కమిటీకి తక్షణం ఈ అధికారాలు, నిధులు బదిలీ చెయ్యాలని లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది.

## ప్రభుత్వం మద్యంపై విధాన ప్రకటన చెయ్యాలి

రాష్ట్ర ప్రభుత్వం మద్యంపై తన విధాన ప్రకటన చెయ్యాల్సిందిగా లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఈ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయమార్గంగా పరిగణిస్తున్నదా? రాష్ట్రంలో అక్రమ బెల్టుషాపులను మూసివేయిస్తారా? గుడుంబా, నాటుసారా నిషేధాన్ని అమలు చేస్తారా? ఈ అంశాలపై ప్రభుత్వ విధానాన్ని స్పష్టంగా ప్రకటించమని కోరుతున్నది. ప్రస్తుతం ఆడుతున్న కపట నాటకాన్ని, ద్వంద్వ వైఖరిని విడనాడాలని లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది.

ఉలుకు పలుకు లేని ప్రభుత్వం

అక్టోబరు 2లోగా బెల్టుషాపులు మూసివెయ్యకపోతే వాటిని మూసివేసే ఉద్యమాన్ని లోక్‌సత్తా నిర్వహిస్తుంది. మద్యం నియంత్రణ కోసం లోక్‌సత్తా తలపెట్టిన ప్రచారాన్ని ఈ రెండు నెలలలో ఉధృతంగా సాగిస్తాం. ఇప్పటికే రాష్ట్రంలో, గ్రామాలలో ఉన్న బెల్టుషాపులను గురించి ప్రభుత్వానికి తెలియజేస్తున్నాం. అక్రమ బెల్టుషాపుల మీద ప్రభుత్వం ఉలుకుపలుకు లేకుండా మౌనం పాటించడం దాని ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది. అందుచేత ప్రజలు మద్య నియంత్రణ ఉద్యమానికి సన్నద్ధులు కావాల్సిందిగా లోక్‌సత్తా పార్టీ పిలుపునిస్తుంది.

**ప్రభుత పన్నిన ఉచ్చు**
**బెల్టుషాపుల రొచ్చు**
**మహిళ బతుకున చిచ్చు**
**ఓ కూనలమ్మ**

## 'బెల్టు' తీస్తాం

**బెల్టుషాపులపై అక్టోబరు 2 నుంచి ప్రత్యక్ష పోరు**

**ప్రజలచేతే చట్ట ప్రకారం అరెస్టులు**

**మద్యం పాపం కాంగ్రెస్, తెదేపాలదేనని విమర్శ**

**నేటి నుంచి మహిళాసత్తా ప్రచారయాత్ర**

**సమర శంఖం పూరించిన డా॥ జయప్రకాష్**

రాష్ట్రంలో అక్రమంగా నడుస్తున్న మద్యం బెల్టుషాపులను మూసివేసేందుకు లోక్‌సత్తా పార్టీ వినూత్న ఉద్యమాన్ని చేపడుతోంది. రాష్ట్రంలో ఇంతవరకు ఏపార్టీ చేయని విధంగా.... చట్టంలో పౌరులకు ఉన్న అధికారాలను వినియోగించుకుని బెల్టుషాపులను మూసివేయించేందుకు పార్టీ సమాయత్తమవుతోంది. ఇందుకు ప్రజలను సిద్ధం చేసేందుకు మహిళా సత్తా బుధవారం నుంచి ప్రచారయాత్రలకు శ్రీకారం చుడుతోంది. బెల్టుషాపులు నడపడం అక్రమం కాబట్టి ప్రభుత్వం ముందుకొచ్చి అక్టోబరు 2లోగా స్వచ్ఛందంగా వాటిని ఎత్తివేయాలని లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త జయప్రకాష్ నారాయణ్ అల్టిమేటం జారీ చేశారు. లేకపోతే సీఆర్‌పీసీలోని(CrPC) 43 సెక్షన్‌ను ఉపయోగించుకుని ప్రజలచేతే బెల్టుషాపులను మూసివేయిస్తామని ప్రకటించారు. ఆయన మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సెక్షన్ 43 ప్రకారం ఎక్కడైనా కళ్ళెదురుగా నాన్‌బెయిలబుల్, శిక్షార్హమైన నేరం జరుగుతున్నట్లయితే నిరోధించే హక్కు పౌరునికి ఉందని జెపీ తెలిపారు. ఆ ప్రకారం ప్రజలకు.... ఆ నేరాలకు పాల్పడేవారిని అరెస్టు చేసే అధికారం కూడా ఉంటుందని చెప్పారు. పోలీసులు సహకరించకుంటే బాధ్యులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని స్పష్టం చేశారు. అక్రమంగా బెల్టుషాపుల నిర్వహణ బెయిలుకు అర్హతలేని, శిక్షార్హమైన నేరం కిందకు వస్తుందని తెలిపారు. బ్లేడ్లు, కారం ఉపయోగించే విధానం తమది కాదన్నారు. ప్రజలకు ఎటువంటి ఆటకం లేకుండా ఉద్యమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఏ దశలోనూ చట్టాన్ని అతిక్రమించబోమన్నారు. రాష్ట్రంలో మద్యం రక్కసి వికృతరూపానికి గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ, ప్రస్తుత పాలకపార్టీ కాంగ్రెస్‌లదే బాధ్యత అని జెపీ పేర్కొన్నారు. తెదేపా గతంలో మద్య నిషేధాన్ని

ఎత్తివేస్తే, ప్రస్తుత ప్రభుత్వం మద్యం వినియోగాన్ని మరింత వ్యాప్తి చేసిందని ధ్వజమెత్తారు. ఎక్సైజ్ అధికారులకు పదోన్నతులను మద్యం అమ్మకాలతో ముడిపెట్టిన ప్రభుత్వం..... ఇప్పుడు మద్య విమోచన కమిటీ ఏర్పాటు చేయడం ప్రజలను మోసపుచ్చడమేనని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో మద్యం అమ్మకాలను పెంచుకునేందుకు ప్రభుత్వం పడుతున్న తపన అంతాఇంతాకాదని విమర్శించారు. ప్రస్తుత సంవత్సరంలో రూ. 4125 కోట్ల కేవలం ఎక్సైజ్ ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకోవడమే దీనికి తార్కాణమన్నారు. కాంగ్రెస్, తేదేపాలకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో మద్యం పంచబోమని ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. అవి బెల్టుషాపులను వ్యతిరేకించాలని కూడా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలు వీటి వల్ల నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో యువకులు మద్యం మత్తులోపడి చివరకు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. కొన్ని గ్రామాల్లో మరణాలరేటు వెయ్యికి నలభైవరకు ఉంటోందంటే దానికి కారణం అక్రమ మద్యమేనన్నారు.

బెల్టుషాపులను మూయించే ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు వీలుగా **"హెల్ప్‌లైన్‌ను"** ఏర్పాటు చేస్తున్నట్లు జేపీ తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉండే 23232711 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పవచ్చునన్నారు. ఆగస్టు 15 నుంచి అక్టోబరు 2 వరకు మహిళాసత్తా ఆధ్వర్యంలో మద్య నియంత్రణ ప్రచార యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంలో మొదలయ్యే యాత్ర హైదరాబాద్ చేరుకోవడంతో ముగుస్తుందని చెప్పారు. అప్పటినుంచి బెల్టుషాపులపై ప్రత్యక్షపోరు మొదలవుతుందని అన్నారు. **- (ఆగస్టు 15,2007)**

**లోక్‌సత్తా పార్టీ**

**"హెల్ప్‌లైన్"**

**ఫోన్ నెంబర్**

**040 - 23232711**

# బెల్టు తీసే ముందు... చిత్తశుద్ధిని ప్రదర్శించండి

"మేమూ బెల్టు తీస్తామంటూ" తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శులు బెల్టుషాపులపై ఉద్యమిస్తామని చేసిన ప్రకటన గురివిందగింజ చందంగా ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.వి.యస్.వర్మ విమర్శించారు. "బెల్టుషాపుల్ని మేం మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాం" అని చెప్పడం బుకాయించడం తప్ప చిత్తశుద్ధిని ప్రదర్శించడం కాదని ఆయన అన్నారు. కాబట్టి "బెల్టుతీసే" ముందు ఈ బెల్టుషాపులకీ, చీపులిక్కరుకీ శ్రీకారం చుట్టిన పాపం తమ ప్రభుత్వానిదేనన్న సంగతిని వారు నెమరవేసుకోవాలని ఆయన కోరారు. ఇది చెరిపేస్తే చెరిగిపోయే చరిత్ర కాదని, 'వెన్

19-08-2007

## మేమూ బెల్టు తీస్తాం......

### బెల్టుషాపులను మేం మొదటినుంచీవ్యతిరేకిస్తున్నాం

**- తెలుగుదేశం పార్టీ ప్రకటన**

---

## ఈ బుకాయింపు గురివింద చందం

**- లోక్‌సత్తా పార్టీ ప్రతిస్పందన**

ఉమన్ యునైట్' అనే పేరుతో 'మారియా లార్సన్' ఆంధ్రప్రదేశ్‌లో సారావ్యతిరేక ఉద్యమం అనంతర పరిణామాలపై ఒక ప్రామాణికమైన పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించి ఈ చరిత్రను అక్షరబద్ధం చేసిందని వర్మ పేర్కొన్నారు. 2001లో చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టి అనధికారమైన బెల్టుషాపుల ద్వారా కిరాణాకొట్లలో కూడా మద్యాన్ని అమ్మించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని ఈ గ్రంథం విస్పష్టంగా పేర్కొంటోందని ఆయన అన్నారు..

తెలుగుదేశం పార్టీ ప్రారంభించిన బెల్టుషాపుల్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత జోరు చేసిందని, మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవడంలో ఈ రెండు పార్టీలు దొందూ దొందుగానే వ్యవహరించాయని వర్మ స్పష్టం చేశారు.

“1997-98లో మద్య నిషేధాన్ని సడలించింది తెలుగుదేశం ప్రభుత్వం. 1998-99నాటికి 1964.54 కోట్లు ఉన్న మద్యం మీద ప్రభుత్వ వార్షిక ఆదాయాన్ని 2003-04 నాటికి 3572.32 కోట్లకి పెంచుకుంటూ పోయింది తెలుగుదేశం ప్రభుత్వం. ఆ తరువాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మూడేళ్ళలో 2006-07 నాటికి ఈ వార్షిక ఆదాయాన్ని 6541.58 కోట్లకు పెంచింది. ” అని వర్మ పేర్కొన్నారు. ఈ వాస్తవాల్ని మభ్యపెట్టి, తాము ఆదినుండీ బెల్టుషాపులకు వ్యతిరేకం అని తెలుగుదేశం నేతలు ప్రకటనలు చేయటం హాస్యాస్పదమని ఆయన అన్నారు.

అయితే బెల్టుషాపుల తొలగింపుకోసం తెలుగుదేశం పార్టీ ఉద్యమం చేస్తామంటే లోక్‌సత్తా పార్టీకేమీ అభ్యంతరం లేదని ఆయన అన్నారు. బెల్టుషాపుల నిర్మూలనకు ఉద్యమం సాగించుకునే హక్కువారికి ఉందని, దానిని ఎవరూ కాదనరని,. కాని దానికోసం “మేం బెల్టుషాపులకు మొదటి నుంచీ వ్యతిరేకులం” అని ప్రజల్ని మభ్యపెట్టే హక్కు మాత్రం వారికి లేదని వర్మ పేర్కొన్నారు.

ఇప్పటికైనా చేసిన తప్పును దిద్దుకోవాలని కోరారు. అలాగే ఎన్నికల్లో తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం పంపిణీ చేయదని తెలుగుదేశం నేతలు ప్రజల ముందుకొచ్చి ప్రమాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు మాట ఇచ్చి ముందుకు కదలాలని హితవు పలికారు.

“మద్యం మహమ్మారిని నియంత్రించాలన్న సంకల్పం గలవారు అన్ని పార్టీలోనూ ఉన్నారు. అలాంటి వారంతా ఇప్పటికే ఉద్యమంలో పాలుపంచుకుంటున్నారు. చిత్తశుద్ధితో ఈ ఉద్యమంలో అందరూ పాలుపంచుకోవాల్సిందిగా లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది” అని వర్మ పేర్కొన్నారు.

**బెల్టుషాపున మందు**
**భర్త వేసే చిందు**
**మహిళ చేసెను బందు**
**ఓ కూనలమ్మ**

# మేమూ బెల్టుతీస్తాం....

# బెల్టుషాపులను మేం మొదటినుంచీవ్యతిరేకిస్తున్నాం

- తెలుగుదేశం పార్టీ ప్రకటన

## ఇదిగో చరిత్ర... కాస్త చిత్తశుద్ధిని ప్రదర్శించండి...



The (then) Chief Minister, Chandra Babu Naidu, is telling the woman, 'Don't cry! I am forced to do this for your welfare and for your children's future! I am doing it with sorrow!'

Cartoon by Sridhar, published in *Eenadu*. Sourced from *'When Women Unite!' the Making of the Anti-Liquor Movement in Andhra Pradesh, India* by Marie Larsson, Stockholm University.

**బెల్టు తీసేముందు**
**కార్టూన్ చూడముందు**
**తె.దే నోరిక బందు**
**ఓ కూనలమ్మ**

# మద్య నియంత్రణపై సమరానికి సన్నాహాలు

బెల్టుషాపులను మూయిద్దాం.
మద్యం పీడను వదిలిద్దాం

బెల్టుషాపుల పోటు
పిల్లల చదువుపై వేటు

మద్యం డబ్బుకు ప్రభుత్వ ఆరాటం
మహిళల బతుకులతో చెలగాటం

బెల్టుషాపుల భరతం పడదాం
పేదల బతుకులో దీపం పెడదాం

బెల్టుషాపులను తొలగిద్దాం
మద్యాన్ని మన ఊరి నుండి తరిమేద్దాం

లైసెన్సులేని బెల్టుషాపులపై సాగించాలివేట
పంచాయితీలు పట్టాలి ప్రజల బాట

మద్యంపై మహిళల పోరుబాట
సుఖ సంసారాలకు వెలుగుబాట

భర్త సంపాదన బెల్టుషాపులకి
భార్య సంపాదన రేషన్ షాపుకి

భర్తల్ని మింగే బెల్టు షాపులకు
భార్యలే పెట్టాలి తలకొరివి

సారా, గుడుంబాలను తరిమేద్దాం
సంసారంలో వెలుగులు నింపుదాం

బెల్టుషాపుల నీడ
పేద ప్రజలకు పీడ

మహిళ పడితే పట్టు
బెల్టుషాపుల ఆటకట్టు

లోక్‌సత్తా బాటను నడుద్దాం
మద్య నియంత్రణ సాధిద్దాం

## ఉద్యమ నినాదాలు

మద్యంపై మహిళలు చేసే రణం
బెల్టుషాపులకు తప్పదు మరణం

బెల్టుషాపు నడపడం చట్టవిరుద్ధం
మూయించడం చట్టబద్ధం

బెల్టుషాపుల జోరు పాలకుల పాపం
తిరగబడకపోతే ప్రజలకు శాపం

# బెల్టుషాపుల్ని మూయిద్దాం..

## సారా - గుడుంబాలను తరిమేద్దాం...

### లోక్‌సత్తా పార్టీ - మహిళాసత్తా, యువసత్తాల విజ్ఞప్తి

**సమరానికి సన్నాహాలు**
**కరపత్రం**

**సోదరీ సోదరులారా!**

**ఇది మద్యాంధ్రప్రదేశ్ :** రాష్ట్రంలో మంచినీళ్ళు దొరకని ప్రాంతాలున్నాయి. పిల్లలకు పాఠశాలలు, ప్రజలకు ఆసుపత్రులు అందుబాటులో లేని గ్రామాలున్నాయి. కాని మద్యం, చీపులిక్కరు, నాటుసారా, గుడుంబాలలో ఏదో ఒకటి దొరకని గ్రామం అంటూలేదు. స్వర్ణాంధ్రప్రదేశ్, హరితాంధ్రప్రదేశ్‌ల మాట ఎలా ఉన్నా రాష్ట్రం ఇప్పుడు మద్యాంధ్రప్రదేశ్ అయ్యింది.

**మహిళల బతుకు దినదిన గండం :** పేద, సామాన్య కుటుంబంలో తాగుడు మొదలైతే అన్నీ కష్టాలే, కన్నీళ్లే. మగవాళ్ళ రోజు కూలి తాగుడుకే పోతున్నది. ఆడవాళ్ల కష్టార్జితాన్ని గుంజుకుంటున్నారు. చెంబు, బిందె అన్నీ తాకట్టు పాలవుతున్నాయి. ధాన్యం, బియ్యం అన్నీ సారాకు పోస్తున్నారు. ప్రతిరోజూ ఇంట్లో కీచులాటలు, తన్నులాటలు.... పిల్లలకు చదువు లేకుండా పోతున్నది. రోగమొస్తే చేతిలో చిల్లిగవ్వ ఉండడం లేదు. కడుపునిండా తిండి, కట్టుకొనేబట్ట, కంటి మీద కునుకు కరువవుతున్నాయి. ఆడవాళ్ళ బతుకు క్షణం, క్షణం.. భయం.. భయం. దినదిన గండం అయ్యింది. కుటుంబాలు కూలిపోతున్నాయి, సంసారాలు కాలిపోతున్నాయి. అందరం ఈ సమస్యను పట్టించుకోవాలి.

**ప్రభుత్వాలకి మద్యమే ఆదాయ మార్గం :** ప్రభుత్వాలకి మద్యం ఆదాయ మార్గం అయ్యింది. అదే ఈ సమస్యలన్నింటికీ మూలం అయ్యింది. మద్యం ఎంత ఎక్కువ అమ్మితే సర్కారుకు అంత ఆదాయం. అందుకోసం తాగుబోతుల్ని తయారు చేస్తున్నది. బెల్టుషాపుల్ని ప్రోత్సహిస్తున్నది. అమ్మకాలకు కోటాలుపెట్టి పోటా పోటీగా మద్యం పోయిస్తున్నది. సుమారు 50లక్షల కుటుంబాలను సర్వనాశనం చేస్తున్నది. ఈ విధానం మారాలి. కఠిన మద్యనియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

**బెల్టుషాపుల చిచ్చు :** మన రాష్ట్రంలో 1100 మండలాలున్నాయి. 28 వేల గ్రామాలున్నాయి. ప్రతి మండలంలో లైసెన్సు ఉన్న బ్రాందీషాపులు ఒకటి, రెండు ఉన్నాయి. కాని బెల్టుషాపులు మాత్రం పుట్టగొడుగుల్లా ప్రతి గ్రామంలోనూ పుట్టుకొచ్చాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఒక లక్షకు పైగా బెల్టు షాపులున్నాయి. ఇవి అక్రమ షాపులు. లైసెన్సు లేని షాపులు. ఇక్కడ మద్యం అమ్మడం నేరం. నాటుసారా, గుడుంబాలను నిషేధించినా అవి విచ్చల విడిగా దొరుకుతున్నాయి. ఈ బెల్టుషాపుల్ని, నాటుసారా బట్టీలను తొలగిస్తే 25 వేల గ్రామాలలో మద్యం అమ్మకాలు ఆగిపోతాయి. తాగుడు తగ్గిపోతుంది. కుటుంబాలు బాగుపడతాయి. అందుకే లోక్‌సత్తా ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది.

**మా ఊళ్ళో బెల్టుషాపులు వద్దు**

✦"మా ఊళ్ళో బెల్టుషాపులు వద్దు" అన్నది మనందరి నినాదం కావాలి. ఈ బెల్టుషాపుల్ని ఏ ప్రభుత్వం ప్రారంభించింది, ఏ ప్రభుత్వం కొనసాగిస్తున్నది అన్నది మనకు చర్చనీయాంశం కాదు. అందరం కలిసి ఈ మద్యం మహమ్మారిని గ్రామం పొలిమేరల నుండి తరిమెయ్యాలి

✦బెల్టుషాపుల వివరాలు తెలియజేస్తే వాటిని తక్షణం మూసివేస్తామని 2007మార్చి 8న ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారు. మీ గ్రామంలో బెల్టుషాపుల వివరాలు సేకరించి వెంటనే మూసివెయ్యమని కోరుతూ ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాయండి, రాయించండి.

✦బెల్టుషాపులన్నీ అక్రమ షాపులు. ఇక్కడ మద్యం అమ్మడం నేరం. అలాగే నాటుసారా, గుడుంబా బట్టీలు పెట్టడం నేరం. వాటిని తొలగించమని పంచాయితీలు తీర్మానాలు చేసి ఎక్సైజు, పోలీసు శాఖలకు తెలియజేయాలి.

✦గ్రామంలో పెద్దలంతా ముందుకు రావాలి. గ్రామాన్ని మద్యం అమ్మకం లేని గ్రామంగా ప్రకటించి ఎలాంటి అమ్మకాలు లేకుండా ప్రజల సహకారంతో కట్టుబాటుకు పూనుకోవాలి

✦మహిళా సంఘాలు, పొదుపు సంఘాలు ఏకమై గ్రామంలో బెల్టుషాపుల మూసివేతకు, నాటుసారా, గుడుంబా బట్టీల తొలగింపుకు కొంగు బిగించి ఉద్యమించాలి

✦గ్రామంలోని యువత వలంటీర్ల బృందాలుగా ఏర్పడాలి. బెల్టుషాపుల భరతం పట్టే ఉద్యమానికి ముందుండాలి.

✦బెల్టుషాపులు పెట్టుకుని బతుకుసాగిస్తున్న పేదలకు ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఉపాధికి ఒక పథకాన్ని ప్రకటించాలి.

అక్టోబరు 2లోగా అక్రమ బెల్టుషాపులు, నాటుసారా బట్టీలు తొలగించకపోతే వాటిని మూసి వేసే ప్రత్యక్ష కార్యాచరణకు శాంతియుతంగా ఉద్యమించాలి. మద్యం మహమ్మారిని గ్రామం పొలిమేరలు దాటించాలి. స్థానికంగా మీరు సాగించే ఉద్యమానికి, కార్యకలాపాలకు లోక్‌సత్తా పార్టీ అండగా నిలుస్తుంది. ఇందుకోసం స్థానిక, జిల్లా, రాష్ట్ర శాఖలను సంప్రదించండి.

లోక్‌సత్తా పార్టీ, మహిళా సత్తా, యువసత్తా తలపెట్టిన ఈ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**హైదరాబాద్**
**1-8-2007**

**లోక్‌సత్తా పార్టీ**




## సమరానికి సన్నాహాలు : పోస్టర్లు



# సమరానికి సన్నాహాలు

## పాటలు

**పల్లవి**

**ఇది ఏమి సర్కారు అక్కో - బెల్టుషాపుల మీద**
**బతికేటి సర్కారు - ఇది ఏమి సర్కారు అక్కా**

**చరణం**

రాబడి లోటంటు సర్కారు చెప్పింది
ఆదాయ మార్గంగ మద్యాన్ని దించింది
పల్లె పల్లెకు బెల్టుషాపులు పెట్టింది
చీపు లిక్కరు తెచ్చి సేలు పెంచమంది
గల్లి గల్లికి సార ఏరులైపారించి !
కూలి డబ్బులు దోచి సర్కారు బలిసింది!
మంచినీళ్ళు లేక గగ్గోలు పెడుతుంటే
సారాయి తాగమని చెప్పింది సర్కారు
**॥ ఇది ఏమి ॥**

.................. ... ........................
.................. ... ........................

**పల్లవి**

**యాడంటె ఆడ సారా గుండుంబాయెరో !**
**గరీబోల్ల ముంచెరో !**
**బస్తీ బస్తీకి బెల్టుషాపులొచ్చెరో..**
**ఇంట్లో చిచ్చుబెట్టెరో**

**చరణం**

పెద్దోడిని బడికి పంప పైసలేక పాయె
అయ్యతాగిన సీసలె అమ్మి తిరగబట్టె
చిన్నదాని కెప్పుడు ఏదో జరమాయె
దాని సూది మందులకు దమ్మిడి లేదాయె
తాగుడుతో సంసారం తెర్లయినాదో !
ఇల్లు గుల్లైనాదో !
ఊరంతా అప్పులాయె ఏమి చేద్దురో !
నే నేడ చద్దురో !
**॥ ఏడంటే ఆడ ॥**

.................. ... ........................
.................. ... ........................

పల్లవి : **అమ్మలార అక్కలార**
**చక్కనైన చెల్లెలార**
**చిక్కులతో నీబతుకు - చితికిపాయెనా**
**చక్కదిద్ద లోక్‌సత్తా పార్టీ వచ్చెనా**




**పల్లవి**

**షాపులంట బ్రాంది షాపులంట**
**కాపురాన్ని కాటేసె పాములంట**
**పాములంట.... బెల్టుషాపులంట....**
**॥ షాపు లంట ॥**

**అనుపల్లవి**

అనుమతినిఇచ్చిన షాపు - ఆమెడ కొక్కటెగాని
అక్రమాల బెల్టుషాపు - లన్ని వూల్లలున్నాయి
చీపు లిక్కరు ఒ దిక్కు - నాట సారా ఓ దిక్కు
ఈ రెండింటి మధ్యలోన - నలిగి సచ్చె మొగదిక్కు
ఇక... ఆడోళ్ళకు మిగిలింది - పోరాటమే సరిదిక్కు
**॥ షాపు లంట॥**

.................. ... ........................
.................. ... ........................

# సమరానికి సన్నాహాలు


లోక్‌సత్తా పార్టీ
మహిళా సత్తా
మద్య నియంత్రణ
ప్రచార యాత్ర
ఆగస్టు 15, శ్రీకాకుళంలో ప్రారంభం
అక్టోబర్ 2, హైదరాబాద్‌లో ముగింపు



## సమరానికి సన్నాహాలు



# మహిళాసత్తా చైతన్య యాత్ర

కొన్ని దృశ్యాలు







# మద్యనియంత్రణకు ప్రచారోద్యమం



# ఇవిగో బెల్టుషాపులు....



# మూతబడుతున్న బెల్టుషాపులు

## నేతివారిపాలెంలో మోగిన నగారా




**బెల్టుషాపులపై సమర శంఖం**



కాకవీడులో నాటుసారా, గుడుంబాలపై కొండు బిగించిన





# బెల్టు షాపులు బహిరంగ అమ్మకాలు

